సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం 4 ఆగస్టు 2024



ఏవోబీలో ఫలించిన వ్యూహం
ఏవోబీలో మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 8లో



నిలిచిన రాకపోకలు
ముంచంగిపుట్టు-డుడుమ మార్గంలో పనసచెట్టు రోడ్డుకు అడ్డంగా కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 8లో



అధ్వానంగా జాతీయ రహదారి
వరదలు కారణంగా ఆంధ్రా-ఒడిశా జాతీయ రహదారి-326 బురదమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్సకు అభినందనలు



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎంపికపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖలోని నివాస గృహంలో శనివారం ఆయనను అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జిల్లా పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

గురుకులాల్లో సీట్ల సంఖ్య పెంపు

రంపచోడవరం: జిల్లాలోని గురుకులాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ఒక్కో గ్రూపులో పది చొప్పున సీట్లు పెంచుతూ ఏపీ గురుకుల సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేసినట్టు జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు బాలు అక్కిస తెలిపారు. ఈ ఏడాది టెన్త్ ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉన్నందున మొదటి సంవత్సరంలో చేరే వారు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ప్రతీ గ్రూపులో పది సీట్లు పెంచాలని ఆయనను ఈనెల ఒకటిన కోరినట్టు చెప్పారు. సీట్ల సంఖ్య పెంపుపై కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ పీవోలకు ఉత్తర్వులు పంపారని చెప్పారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు కోరుతూ ఆందోళన

- మోకాళ్లపై నిల్చుని గిరిజనుల నిరసన



కలెక్టర్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి ఆందోళన చేస్తున్న గిరిజనులు

సాక్షి, పాడేరు : తమకు చెందిన వంద ఎకరాల మెట్ట భూమిని గిరిజనేతరుడికి అక్రమంగా చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అనంతగిరి మండలం బూరుగు గ్రామానికి చెందిన గిరిజనులు శనివారం ఆందోళన చేపట్టారు.కలెక్టరేట్ ఎదుట వారు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. కలెక్టర్ దినేష్‌కుమార్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఉమానీలకంఠేశ్వరుడికి రుద్రాభిషేకం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సాక్షి,పాడేరు: పట్టణంలోని ఉమానీలకంఠేశ్వర స్వామికి శుక్రవారం రాత్రి 11 గంటల నుంచి రుద్రాభిషేకం, అఖండ భస్మాభిషేకంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు,ఇతర ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల పోస్టింగ్‌లకు నిబంధనాలు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి పాలనాపరంగా తీసుకుంటున్న నిర్ణయాలు గందరగోళానికి దారితీస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన తహసీల్దార్ల విషయంలో ఇదే పరిస్థితి నెలకొంది. ఎన్నికల అనంతరం వారు మళ్లీ స్వస్థలాలకు తిరిగి వచ్చారు. వీరికి పోస్టింగ్‌లు ఇచ్చే విషయంలో ప్రభుత్వం జారీచేసిన నిబంధనల వల్ల సందిగ్ధత నెలకొంది. దీంతో పాడేరు డివిజన్ పరిధిలోని పది మండలాల్లో తహసీల్దార్ల నియామకం జరగక ఇన్‌చార్జ్‌ల పాలన నెలకొంది.

- కొలిక్కిరాని కేటాయింపు ప్రక్రియ
- కొత్తవారికి పోస్టింగ్‌లు ఇవ్వకుండానే పాతవారు రిలీవ్
- పాడేరు డివిజన్‌లోని పది మండలాల్లో ఇన్‌చార్జిలే దిక్కు
- నిబంధనల ప్రకారమే నియమిస్తాం: కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో తహసీల్దార్ల నియామకంపై కూటమి ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు వల్ల గందరగోళం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పనిచేసిన తహసీల్దార్లను వేరే ప్రాంతాలకు బదిలీ చేయడం తెలిసిందే. ఎన్నికలు పూర్తవడంతో వారిని గతంలో పనిచేసిన స్థానాల్లో నియమించాల్సి ఉంది. వీరి నియామకానికి సంబంధించి ప్రభుత్వం జారీ నిబంధనల వల్ల కొత్త సమస్య నెలకొంది.

నిబంధనలిలా..
పాడేరు డివిజన్‌లో ఆ వ్యక్తి జన్మించి ఉంటే మరో డివిజన్‌లో పోస్టింగ్ ఇవ్వాలి. లేదంటే మరో జిల్లాలో అయినా నియమించాలి. గతంలో పనిచేసిన స్థానంలో నియమించకూడదు. కొత్తగా ఏర్పడిన అల్లూరి జిల్లాలో 22 మండలాలు ఉండగా వీటి పరిధిలో 22 తహసీల్దార్ పోస్టులు ఉన్నాయి. ఇవి కాకుండా కలెక్టరేట్‌లోని పలు విభాగాల్లో నలుగురు, పాడేరు, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కార్యాలయాలు, చింతూరు ఆర్డీవో కార్యాలయంలో మూడు పోస్టులు ఉన్నాయి. జిల్లాలో పనిచేసిన 29 మంది తహసీల్దార్లు సార్వత్రిక ఎన్నికలకు ముందు విజయనగరం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు తాత్కాలిక బదిలీలపై వెళ్లారు. అలాగే ఆయా ప్రాంతాల నుంచి తహసీల్దార్లు జిల్లాకు వచ్చారు. ఎన్నికలు ముగిసిన తరువాత పాడేరు డివిజన్, కలెక్టరేట్‌లో పనిచేసిన తహసీల్దార్లంతా ఇటీవల తమ సొంత జిల్లాలకు వెళ్లిపోయారు.

కలెక్టరేట్‌లో రిపోర్ట్
గతంలో ఇక్కడ పనిచేసిన వారిలో 16 మంది ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాల్లో రిలీవ్ అయి ఇక్కడి కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేశారు. రంపచోడవరం, చింతూరు డివిజన్‌లోని 13 మంది తహసీల్దార్లు మాత్రం ఇంకా రిలీవ్ కాలేదు. ఎన్నికలకు ముందు చింతూరు, రంపచోడవరం డివిజన్‌ల నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లు అక్కడే పనిచేస్తున్నారు.

పోస్టింగ్ కోసం 15 మంది ఎదురుచూపు
ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేసిన 16 మందిలో ఒక్కరికి మాత్రమే (నాన్ లోకల్ కావడంతో) చింతపల్లిలో పోస్టింగ్ ఇచ్చారు. మిగతా 15 మంది పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం పాడేరు డివిజన్‌లో 10 మండలాల్లో తహసీల్దార్లు, కలెక్టరేట్‌లో నాలుగు, పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఒక్క పోస్టు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం వీటికి డిప్యూటీ తహసీల్దార్లు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. దీనిపై కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తహసీల్దార్ల నియామకాలు జరుగుతాయని తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో చిరుద్యోగులపై వేధింపులు

- అన్యాయంగా ఉద్యోగాల నుంచి తొలగింపు
- రంపచోడవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన రేపు
- విజయవంతం చేయాలని పిలుపు

రంపచోడవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీ, ఆశ, వెలుగు యానిమేటర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగిపోయాయని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మట్టా వాణీశ్రీ, పల్లపు వెంకట్ ఆరోపించారు. శనివారం వారు మాట్లాడుతూ ఉద్యోగాల నుంచి తొలగింపులు అధికమయ్యాయని, ఉన్నపళంగా ఉద్యోగాలను తీసేస్తూ స్థానిక రాజకీయ నాయకులు తమ కార్యకర్తలను నియమించుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఈ అరాచకాలను నిరసిస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఐదవ తేదీన జరిగే ర్యాలీ, రంపచోడవరం ఐటీడీఏ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు. రాయలసీమ ప్రాంతంలో రాజకీయ వేధింపులు తీవ్రంగా ఉన్నాయన్నారు. అనంతపురం జిల్లాలో 670 మంది మధ్యాహ్న భోజన పథక కార్మికులు, ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో 300 మంది యానిమేటర్లను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లు 2360 మందిని తొలగించగా నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. ఏజెన్సీ 11మండలాల పరిధిలో కూడా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారని, కాకినాడ జిల్లాలో రౌతులపూడి, కోటనందూరు, జగ్గంపేట, ఏలేశ్వరం, తుని, తొండంగి, యు.కొత్తపల్లి, పిఠాపురం, కాజులూరు, కాకినాడ రూరల్ మండలాల్లో యానిమేటర్లను రాజకీయ కారణాలతో తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన వారందరినీ విధుల్లోకి తీసుకోవాలని, తక్షణం రాజకీయ వేధింపులు ఏజెన్సీలో ఆపాలని వారు డిమాండ్ చేశారు. చిరుద్యోగులపై స్థానిక రాజకీయ నాయకుల పెత్తనం ఆపకపోతే పెద్దఎత్తున ఉద్యమించడానికి కార్మికవర్గం సిద్ధపడుతుందని వారు హెచ్చరించారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణకు ఏర్పాట్లు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : గిరిజన నిరుద్యోగ యువతకు ఐటీడీఏ ద్వారా డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. శనివారం ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 300 మంది నిరుద్యోగ గిరిజన యువతకు డీయస్సీ కోచింగ్ అందజేస్తామన్నారు. అభ్యర్థులు బీఈడీ, డీఈడీ, టెట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. డిగ్రీ, బీఈడీ, డీఈడీ, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా లేదా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి నిబంధనల మేరకు ఎంపిక చేస్తామన్నారు. మహిళా రిజర్వేషన్లను అమలు చేసి ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక విధానం, శిక్షణ కేంద్రాలు తదితర పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవోలు వీఎస్ ప్రభాకర్, వెంకటేశ్వరరావు, డీడీ కొండలరావు, డీఈవో బ్రహ్మజీరావు, ఏటీడబ్ల్యూవో రజని పాల్గొన్నారు.

విద్యుదుత్పత్తికి పుష్కలంగా నీటి నిల్వలు

ఇన్‌చార్జి ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు పరిధిలో అన్ని రిజర్వాయర్లలో ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా నీరు చేరినందు విద్యుదుత్పత్తికి పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నాయని ఇన్‌చార్జి ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బలిమెల రిజర్వాయర్ సామర్థ్యం 95 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఈ వర్షాలకు 45 టీఎంసీలు చేరిందన్నారు. గతేడాది ఇదే సమయానికి 26 టీఎంసీలు మాత్రమే ఉందన్నారు. జోలాపుట్టు పూర్తి సామర్థ్యం 31.5 టీఎంసీలు కాగా 21 టీఎంసీలు నీరు చేరిందన్నారు. గతేడాది ఈ సమయానికి 6 టీఎంసీలు మాత్రమే ఉన్నాయన్నారు. గుంటవాడ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుందని, ఇక్కడ నీటిని వృథా చేయకుండా సీలేరు జల విద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి ప్రస్తుతం జరుగుతుందన్నారు. డొంకరాయి జలాశయంలో కూడా 13 టీఎంసీల నీరు ఉండగా, ప్రస్తుతం ఆ జలాశయానికి 8 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుందన్నారు. దీనిలో నాలుగువేల క్యూసెక్కులు జనరేషన్ చేయగా, 64 వేల క్యూసెక్కులు మెయిన్ డ్యాం ద్వారా దిగువకు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలతో పాటు రానున్న వర్షాలకు మరింత నీరు చేరుతుందని, వచ్చే వేసవికి విద్యుదుత్పత్తికి ఎలాంటి ఇబ్బంది లేకుండా గోదావరి పంట భూములకు కూడా పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

రంపచోడవరం డైట్‌లో ఉత్తమ ఫలితాలు

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాల 2022-24 బ్యాచ్ 4వ సెమిస్టర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ చిన్నబాబు తెలిపారు. పరీక్షలు రాసిన 36 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. రెండు సంవత్సరాల శిక్షణ ఫలితాల్లో ప్రథమ స్థానం కుంజం దివ్య 2,800 మార్కులకు 2549 సాధించిందన్నారు. ద్వితీయ స్థానం నర్సి శివ 2,510 మార్కులు, తృతీయ స్థానం మడి పోసిబాబు 2,504 మార్కులు, నాల్గవ స్థానం సోడే గణేస్, మిర్తివాడ సాయి పుష్పలత 2489 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను, కళాశాల ప్రిన్సిపాల్ చిన్నిబాబును రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అభినందించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల వినతి



ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్‌కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కట్టా సింహాచలం కృషి చేయాలని నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కోరారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శనివారం పీవోతోపాటు, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌లను ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు ఘనంగా సత్కరించారు. ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. ఐటీడీఏలో లీగల్ సెల్ ఏర్పాటుతోపాటు అభివృద్ధికి సంబంధించి కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. తక్షణం పెండింగ్‌లోని పనులను పూర్తి చేయించాలన్నారు. ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగం పెరిగిందని దానిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు బందం శ్రీదేవి, సార్ల లలితకుమారి, కుంజం మురళి, అబ్బాయిరెడ్డి, జెడ్పీటీసీలు పండా వెంకటలక్ష్మి, గొర్లె బాలాజీ బాబు, శిరసం కృష్ణవేణి,సర్పంచ్ మంగా బొజ్జియ్య, కుంజం వెంకటలక్ష్మి, వడగల ప్రసాద్, కొమరం పండుదొర, మిర్తివాడ ఆనంద్‌రెడ్డి, కోసు రమేష్‌బాబుదొర, వైఎస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, ఎంపీటీసీలు వంశీ కుంజం, ఉలవల లక్ష్మి, నర్రి పాపారావు, బచ్చల వెంకయమ్మ ,మాజీ సర్పంచ్ పండా రామకృష్ణదొర తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పొంగిన సోకిలేరు..

11 గ్రామాల ప్రజలకు అవస్థలు



చింతూరు-వీఆర్‌పురం రహదారిపై ప్రవహిస్తున్న సోకిలేరు వాగు

చింతూరు: మండలంలోని సోకిలేరు వాగు మళ్లీ పొంగడంతో చింతూరు, వీఆర్‌పురం మండలాల మధ్య శనివారం మళ్లీ రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం ఉదయం కొంతసేపు రాకపోకలు కొనసాగాయి. అయితే శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పది గంటల తరువాత ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు భారీగా రావడంతో వాగు ఉధృతి పెరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మండలంలోని 11 గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



చింతూరు వచ్చేందుకు అవతలి ఒడ్డున వేచిన ఉన్న ప్రజలు

సామాజిక బాధ్యతగా గంజాయి నిర్మూలన

ఎస్పీ అమిత్ బర్దర్



మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్ధర్

పాడేరు : మన్యంలో గంజాయిని శాశ్వతంగా నియంత్రించేందుకు ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా గుర్తించి కృషి చేయాలని ఎస్పీ అమిత్‌బర్దర్ సూచించారు. జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో శనివారం పాడేరు, పెదబయలు, జి.మాడుగుల మండలాలకు చెందిన పలువురు జీపు, మోటర్ యూనియన్ నాయకులు, ఆర్టీసీ కార్మిక సంఘాలు, ఉపాధ్యాయ, మీడియా సంఘాలతో గంజాయి నిర్మూలనపై చర్చించారు. గంజాయి వల్ల సమాజంలో జరుగుతున్న నష్టాలను ఎస్పీ వారికి వివరించారు. గంజాయి సాగు కోసం గంజాయి వ్యతిరేక సంఘాన్ని ఏర్పాటు చేసి ప్రతి నెల పోలీసులతో సమీక్ష నిర్వహిస్తామని ఎస్పీ తెలిపారు. గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాల్లో ఎక్కడైనా గంజాయి గుప్పుమన్న వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని ఆయన కోరారు. గ్రామాలు, మండల కేంద్రాలు, విద్యా సంస్థల్లో గంజాయి వ్యతిరేక సంఘాల కమిటీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గంజాయి వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించాలని సూచించారు. గంజాయి నిర్మూలనకు ప్రతి ఇంటి నుంచి ఒకరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో పాడేరు ఏఎస్పీ ధీరజ్, స్పెషల్ బ్రాంచి సీఐ హిమగిరి, సోషల్ మీడియా సెల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, పాడేరు సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుధ్యంపై డీఎల్పీవో ఆగ్రహం

ముగ్గురు సిబ్బందికి షోకాజ్ నోటీసు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎల్పీవో రాఘవన్

చింతూరు: పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకుంటే చర్యలు తప్పవని రంపచోడవరం డీఎల్పీవో రాఘవన్ హెచ్చరించారు. ఈ మేరకు పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టని ముగ్గురు సిబ్బందికి శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. శనివారం ఆయన కూనవరం మండలం టేకులొద్ది గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించకపోవడాన్ని ఆయన గుర్తించారు. తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు క్లోరినేషన్ చేయకపోవడంతోపాటు, గ్రామంలో మలేరియా కేసులు నమోదవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన అభిచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్, గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ హరిబాబుతో పాటు సంబంధిత ఏఎన్ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఎల్పీవో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారం రోజులపాటు గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా చేపట్టాలని, తాగునీటి ట్యాంకులకు క్లోరినేషన్ చేయాలని, ప్రతిరోజూ ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు.

ధర చెల్లింపులో ఐటీసీ వివక్ష

జామాయిల్ రైతుల ఆవేదన



మాట్లాడుతున్న జామాయిల్ రైతులు

ఎటపాక: జామాయిల్ కర్ర కొనుగోలులో ఒక్కో ప్రాంతానికి ఒక్కో ధర ఇస్తూ ఈప్రాంత రైతులను ఐటీసీ కంపెనీ రా మెటీరియల్ యాజమాన్యం మోసం చేస్తోందని మండలానికి చెందిన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడుతూ తెలంగాణలోని సారపాక, ములకలపల్లి, మణుగూరు, భూర్గంపాడు ప్రాంతాల నుంచి కంపెనీకి వచ్చే జామాయిల్ కర్రకు రైతుల నుంచి టన్నుకు రూ.8 వేలకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. అయితే కంపెనీకి పక్కనే ఉన్న విలీన మండలాల రైతులు కర్రను కంపెనీకి తీసుకువెళ్తే టన్నుకు రూ.7,500 మాత్రమే ఇచ్చి ఈప్రాంత రైతులపై వివక్ష చూపుతున్నారన్నారు. తెలంగాణ ప్రాంత రైతులకు మాదిరిగానే తమకు అదే ధర చెల్లించాలని, లేకపోతే కంపెనీ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

రేవళ్లుకు చదువుల తల్లి వచ్చేనా?

- ఆరేళ్ల క్రితం మూతపడిన ఎయిడెడ్ పాఠశాల
- అప్పటినుంచి ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు ఎదురు చూస్తున్న గ్రామస్తులు
- చదువు నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్తున్న వందమంది విద్యార్థులు
- సిద్ధంగా భవనం
- ఇప్పటికైనా అనుమతి ఇవ్వాలని గ్రామస్తుల వినతి



డీఈవో బ్రహ్మజీరావుకు సమస్య వివరిస్తున్న గ్రామస్తులు (ఫైల్)



ఎయిడెడ్ పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మజీరావు

కొయ్యూరు: నాలుగు వేల జనాభా కలిగిన రేవళ్లులో పాఠశాల లేకపోవడం తల్లిదండ్రులను కలవరానికి గురిచేస్తోంది. ఒకప్పుడు ఇక్కడ ఎయిడెడ్ పాఠశాల ఉండేది. ఒకటి నుంచి ఐదు వరకు సుమారు వంద మంది విద్యార్థులు ఇక్కడ చదివేవారు. ఉపాధ్యాయుడు పదవీ విరమణ చేసిన తరువాత యాజమాన్యం మరో ఉపాధ్యాయుడిని నియమించలేదు. దీంతో ఆరేళ్ల క్రితం బోధన నిలిచిపోవడంతో పాఠశాల మూతపడింది. దీంతో ఇక్కడి విద్యార్థులు రోజూ ఐదు నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలోని కొయ్యూరు, రాజేంద్రపాలెం పాఠశాలలకు వెళ్లి వస్తున్నారు. చిన్న పిల్లలు కావడంతో తల్లిదండ్రులు భయపడుతున్నారు. గ్రామంలో పాఠశాల ఏర్పాటుపై గతేడాది ఎంపీపీ బడుగు రమేష్ గ్రామస్తులతో కలిసి అప్పటి కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిని అప్పటిలో విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపించడంతో పాఠశాల ఏర్పాటుకు అనుమతి వస్తుందని గ్రామస్తులు ఆశపడ్డారు. దీనిపై ఎటువంటి స్పందన లేకపోవడంతో వారు నిరాశకు గురయ్యారు. తాజాగా సర్పంచ్ వెంకటలక్ష్మి, గ్రామస్తులు గిరిజన సంక్షేమశాఖ మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. కలెక్టర్‌కు సమస్యను వివరించారు. పాఠశాల మంజూరుకు చర్యలు తీసుకుంటారని వారు ఆశిస్తున్నారు. ప్రభుత్వం పాఠశాల మంజూరు చేస్తే అందుకు అవసరమైన భవనం కూడా సిద్ధంగా ఉంది. విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు వారం రోజుల క్రితం డీఈవో బ్రహ్మజీరావు ఈ భవనాన్ని పరిశీలించారు. సమస్యను కలెక్టర్‌కు నివేదించామని ఆయన తెలిపారు. త్వరలోనే పాఠశాల ఏర్పాటుకు అనుమతి వస్తుందని చెప్పారు.

క్లుప్తంగా

తునికాకు సేకరణ కూలి చెల్లింపునకు వినతి



రేంజర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

ఎటపాక: తునికాకు సేకరణ కూలి చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో వారు నెల్లిపాక అటవీశాఖ రేంజర్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఐవీ మాట్లాడుతూ...ఈఏడాది తునికాకు సేకరణ డబ్బులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా 2012 నుంచి పెండింగ్‌లో ఉన్న బోనస్ కూడా తక్షణమే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కాక అర్జున్, బుద్దుల భద్రయ్య, ఇరప సత్యం పాల్గొన్నారు.

సున్నం రాజయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం



రాజయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

రాజవొమ్మంగి : భద్రాచలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు సున్నం రాజయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు అన్నారు. రాజయ్య 4వ వర్ధంతి సందర్భంగా సీపీఎం నాయకులు శనివారం రాజవొమ్మంగి పార్టీ కార్యాలయంలో రాజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజయ్య తన చివరి శ్వాస వరకు ఆదివాసీల కోసం, పేద ప్రజల కోసం పోరాడారన్నారు. తునికాకు బోనస్ డబ్బుల కోసం, పోలవరం నిర్వాసితుల కోసం పోరాడారని గుర్తు చేసుకొన్నారు. కార్యక్రమంలో కోండ్ల సూరిబాబు, కె.జగన్నాథం, పాండవుల సత్యనారాయణ, రాంబాబు, రమేష్, రామరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏవోబీలో ఫలించిన వ్యూహం

- జల్లెడ పట్టిన బలగాలు
- కానరాని మావోయిస్టుల జాడ
- ప్రశాంతంగా ముగిసిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు



మోతుగూడెం ప్రాంతంలో కూబింగ్‌లో బలగాలు

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు భగ్నం చేసేందుకు పోలీసుల వ్యూహం ఫలించింది. గత నెల 28 నుంచి ఈనెల 3 వరకు మావోయిస్టులు అమరవీరుల వారోత్సవాలకు పిలుపునివ్వడం తెలిసిందే. దీంతో అప్రమత్తం అయిన పోలీసు బలగాలు ఏవోబీలో కూంబింగ్ విస్తృతం చేశాయి. మండల కేంద్రాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా మారుమూల గ్రామాల్లో గట్టి నిఘా పెట్టారు. దీంతో మావోయిస్టులు ఎక్కడ ఎటువంటి సభలు, సమావేశాలు నిర్వహించలేకపోయారు. ముందస్తు వ్యూహంతో పోలీసులు మావోయిస్టుల వారోత్సవాలను కట్టడి చేసి పైచేయి సాధించారు.శనివారంతో ముగియడంతో పోలీసులు, సరిహద్దు గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మోతుగూడెం: సివిల్, సీఆర్పీఎఫ్ బలగాలు డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ముమ్మర తనిఖీలు చేపట్టాయని ఎస్ఐ శివ కుమార్ తెలిపారు. మావోయిస్టులు సంచరించే అవకాశాలు ఉన్న ప్రాంతంలో బలగాలు జల్లెడ పట్టాయని ఆయన పేర్కొన్నారు.

కొయ్యూరు: ఒకప్పుడు మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ప్రాంతాల్లో కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. కొయ్యూరు, బాలారేవుల, బూదరాళ్ల, బీమవరం ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. మావోయిస్టుల మూలంగా జరుగుతున్న నష్టాన్ని గిరిజనులకు పోలీసులు వివరించారు. వారోత్సవాల సందర్భంగా విధ్వంసాలు పాల్పడే అవకాశం ఉందని అనుమానించిన పోలీసులు మంప, రేవళ్లు, బూదరాళ్ల వెళ్లే బస్సులను వారం పాటు నిలిపివేశారు. వారోత్సవాలు ముగిసిన నేపథ్యంలో వాటిని ఆదివారం నుంచి పునరుద్ధరించే అవకాశం ఉంది.

ఆదివాసీ దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు



హాజరైన ప్రజాప్రతినిధులు, గిరిజన పెద్దలు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సింహాచలం

- భేదాభిప్రాయాలకు తావులేకుండా నిర్వహణ
- రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం
- గిరిజన తెగల నాయకులు, అధికారులతో సమీక్ష

రంపచోడవరం : మండల కేంద్రంలో ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. అన్ని తెగల గిరిజనుల సమక్షంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఐటీడీఏ సమావేశపు హాలులో శనివారం పీవో, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌లు గిరిజన తెగల నాయకులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అసలైన గిరిజన తెగలు ఏం కోరుకుంటున్నది, గిరిజనుల అభిప్రాయాలను, ఆర్థిక సమస్యలను ముందుగా తెలుసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. గిరిజన తెగల్లో భేదాభిప్రాయాలు లేకుండా పార్టీలకు అతీతంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు. గిరిజన తెగల కుల పెద్దలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక్కో తెగ నుండి ఇద్దరు నాయకులను ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజు వేదికపైకి ఆహ్వానించడం జరుగుతుందని ఆయన తెలిపారు. సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజనుల అభివృద్ధి కోసం ఒక మిషన్ ప్లాన్ తయారు చేసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

నిలిచిన రాకపోకలు

- ఏవోబీలో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు
- ఐదు గంటల పాటు అంతరాయం



చీకట్లో చెట్టును తొలగిస్తున్న స్థానికులు

ముంచంగిపుట్టు : మండల కేంద్రం నుంచి డుడుమ వెళ్లే ఆర్‌అండ్‌బీ మార్గంలో అపసరాడ గ్రామ సమీపంలో శనివారం మధ్యాహ్నం భారీ పనస చెట్టు ఈదురు గాలులకు రోడ్డుకు అడ్డంగా కూలింది. దీంతో ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల మధ్య వాహన రాకపోకలు సుమారు ఐదు గంటల పాటు నిలిచి పోయాయి. రోగిని విశాఖ తరలించి తిరిగి వస్తున్న మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఆస్పత్రి అంబులెన్స్ నిలిచిపోయింది. వైస్ ఎంపీపీ భాగ్యవతి భర్త దేవ, సీపీఎం నేత శంకర్‌రావు అసరాడ, వనుగుమ్మ, దాబుగూడ గ్రామస్తుల సాయంతో చెట్టును తొలగించారు. రాత్రి ఏడు గంటల తరువాత రాకపోకలు ప్రారంభం అయ్యాయి. చెట్టు కూలిన సమాచారం ఆర్‌అండ్‌బీ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని వాహనదారులు,స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన మజ్జి కృష్ణ

హుకుంపేట : మండల కేంద్రంలో ఓ వ్యక్తి మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలివి. మండల కేంద్రంలో సాయిబాబ ఆలయం వీధిలో మజ్జి కృష్ణ(34) నివాసం ఉంటున్నారు. గత ఏడాది కుమారుడు మృతి చెందినప్పటి నుంచి మద్యానికి బానిసై మానసిక వేదనతో శుక్రవారం ఆత్మహత్య చేసుకుని ఉంటాడని మజ్జి కృష్ణ భార్య సుజాత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న సీఐ సన్యాసినాయుడు ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ చిట్టిబాబు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడు కృష్ణ మండల కేంద్రంలో పెయింటింగ్ పని చేసేవాడు. అతని మృతితో స్థానికంగా విషాదం నెలకొంది.

నెల్లిపూడిలో మాదిగల సంబరాలు



సభలో ప్రసంగిస్తున్న జాతీయ మానవ హక్కుల సంఘం జోనల్ అధ్యక్షుడు తాతపూడి ప్రకాష్

గంగవరం : ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి సుప్రీం కోర్టు ఇచ్చిన సానుకూల తీర్పునకు మాదిగ జాతి సంబరాలు జరుపుకొంటుందని జాతీయ మానవ హక్కుల సంఘం జోనల్ ప్రెసిడెంట్ తాతపూడి ప్రకాష్ అన్నారు. శనివారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్ష, కార్యదర్శులు ములగాడ ప్రసాద్‌బాబు, ఎం.సోమరాజు ఆధ్వర్యంలో నెల్లిపూడి అంబేడ్కర్ సెంటర్‌లో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాతపూడి ప్రకాష్ మాట్లాడుతూ మాదిగ దండోరా ఉద్యమ నేత మందాకృష్ణ మాదిగ మూడు దశాబ్దాలుగా ఉద్యమాన్ని నిర్వహించడం వల్లే ఈ రోజు విజయం సాధించామన్నారు. ఉద్యమంలో ఎందరో మాదిగ బిడ్డలు అమరులయ్యారన్నారని, వారందరికీ ఈ విజయం అంకితమని అన్నారు. తరతరాలుగా మాదిగ జాతి ఎదుర్కొంటున్న కుల వివక్ష, సామాజిక వెనుకబాటుతనం నుంచి, మాదిగల తలరాతలు మారాలంటే దండోరా ఉద్యమమే ప్రధానమని ఈ ఉద్యమాన్ని కృష్ణమాదిగ ముందుకు తీసుకువెళ్లారన్నారు. తొలుత మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీలకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో చిర్రా జాషువా, తాతపూడి అప్పారావు, భాస్కర్, భద్రం, పలివెల రమణ, కాకర గణేష్, మోరంపూడి శివ, సూరి బాబు, శేఖర్, వీరబాబు, శామ్యూల్, నాని, అడ్డతీగల ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు శ్యామ్ బాబు పాల్గొన్నారు.

మినీ గోకులాల ఏర్పాటుకు దరఖాస్తులు



పశు వైద్యాధికారి సౌజన్యదేవి

ముంచంగిపుట్టు: మినీ గోకులాల ఏర్పాటుకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని పశువైద్యాధికారి ఎం.సౌజన్యదేవి అన్నారు.ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 25 మినీ గోకులాలు మంజూరయ్యాయని, అర్హులైన గిరిజన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 90శాతం సబ్సిడీతో గోకులాలు నిర్మాణాకి ఉపాధి హామీ ద్వారా బిల్లులు అందించనున్నట్టు పేర్కొన్నారు .రెండు ఆవుల గోకులం యూనిట్ ధర రూ.1.15లక్షలు కాగా సబ్సిడీపై రూ.11,500 నిర్మించుకోవచ్చని, నాలుగు ఆవుల గోకుల నిర్మాణానికి రూ.1.85లక్షలు కాగా సబ్సిడీపై రూ.18,500లతో ఏర్పాటుచేసుకోవచ్చని, ఆరు ఆవుల గోకుల నిర్మాణానికి రూ.2.30లక్షలు కాగా సబ్సిడీపై రూ.23వేలతో నిర్మించుకోవచ్చన్నారు. 20 మేకలు లేక గొర్రెలున్న యూనిట్ ధర రూ.1.30వేలు కాగా సబ్సిడీపై రూ.30వేలతో, 50 పశువులున్న యూనిట్ ధర రూ.2.30లక్షలు కాగా సబ్సిడీపై రూ.69వేలతో గోకులం నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుదారుడు మినీ గోకులం దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్ ,బ్యాంక్ పాసు బుక్, కుల ధృవపత్రం, పట్టాదారు పాసు పుస్తకం, ఉపాధి జాబ్‌కార్డు, ఇంటి పన్ను రశీదు, విద్యుత్ బిల్లుల జెరాక్స్ కాపీలతో రూ.50ల నాన్ జ్యూడిషియల్ డిక్లరుషన్ స్టాప్ పేపర్ పాటు గోకులం నిర్మించుకునే స్థలం ఫోటో, దరఖాస్తుదారుడి పాసు ఫోటోలతో పాటు గ్రామ సభ తీర్మాన పత్రాన్ని దరఖాస్తుతో జతచేసి పశు వైద్య సిబ్బందికి అందించాలని ఆమె కోరారు. దరఖాస్తులు గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయని, పూర్తి స్థాయి సమాచారం కోసం పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఆమె కోరారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు, రిమాండ్‌కు తరలింపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రుద్ర శేఖర్, వెనుక నిందితుడు

డుంబ్రిగుడ : మండలంలోని భల్లుగుడ గ్రామంలో గత నెల 31వ తేదీన జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు అరకులోయ సీఐ సీహెచ్ రుద్ర శేఖర్ తెలిపారు. వివరాలివి. నిందితుడు శెట్టి రాజ్ కుమార్ (33) తన రెండో భార్య అయిన బంగురు దేవి (29)ని హతమార్చి ద్విచక్రవాహనంలో ఒడిశా రాష్ట్రానికి వెళ్లి పోయాడన్నారు. శనివారం నిందితుడు ఒడిశా నుంచి డుంబ్రిగుడ మండలానికి వస్తున్నట్టు తెలుసుకొని జైపూర్ జంక్షన్ వద్ద నిఘా వేసి పట్టుకున్నామన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎస్ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

అధ్వానంగా జాతీయ రహదారి

రాకపోకలకు ఇబ్బందులు



బురదలో కూరుకుపోయి ఉన్న ట్రాక్టర్‌ను బయటకు తోస్తున్న పొక్లెయిన్

చింతూరు: భారీ వర్షాలు, వరదల కారణంగా ఆంధ్రా– ఒడిశా జాతీయ రహదారి–326 బురదమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు నెలల క్రితం కాంట్రాక్టరు ఈ రహదారి పనులను ప్రారంభించారు. వర్షాలు, వరదల కారణంగా పనులు నిలిచిపోయాయి. రహదారి ఎత్తు పెంచేందుకు పలుచోట్ల రహదారిపై మట్టిని పరచడంతో అదికాస్తా బురదమయంగా మారిపోయింది. దీనికితోడు ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఈ రహదారి ఒకచోట భారీ కోతకు గురైంది. ఆ ప్రాంతంలో కూడా మట్టితో పూడ్చడంతో అక్కడ గోతులు ఏర్పడి వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో గత 15 రోజులుగా ఈ రహదారిపై వరదనీరు నిలిచి ఉండటంతో మరింత అధ్వానంగా మారింది. రహదారి నిర్మాణంలో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న కల్వర్టుల వద్ద మట్టిని పోయడంతో ఆయా ప్రాంతాల్లో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే వరదనీరు కల్లేరు ఆశ్రమ పాఠశాలతో పాటు కొన్ని ఇళ్లను కూడా ముంచెత్తింది. వరద తగ్గినా ప్రతిరోజూ వర్షాలు కురుస్తుండడంతో పనులు చురుగ్గా సాగడంలేదు. వర్షాలు పూర్తిగా తగ్గితేగానీ ఈ రహదారి పనులు సాఫీగా సాగే పరిస్థితి లేదు. నేషనల్ హైవే ఎస్ఈ సత్యనారాయణ శనివారం ఈ రహదారిని పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించిన ఆయన వెల్లడించారు.

సిరుల తల్లి సన్నిధిలో శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 5 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రావణలక్ష్మి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసుల రెడ్డి, సహాయ కార్యహణాధికారి వి.రాంబాబు తెలిపారు. శ్రావణమాసంలో వచ్చే రెండో శుక్రవారం (ఆగస్టు 16న)వరలక్ష్మీ వ్రతం, 19న శ్రావణ పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈవో తెలియజేశారు. శ్రావణ మాసంలో వచ్చే నాలుగు శుక్రవారాలు (ఆగస్టు 9, 16, 23, 30) విశేష పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

రేపటి నుంచి ప్రారంభం

ఈ నెల 5వ తేదీ ఉదయం 8.20 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభమవుతాయని ఈవో తెలిపారు. నెల రోజుల పాటు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూజలో పాల్గొన్న భక్తులకు అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే సమకూరుస్తుందని తెలిపారు. విశిష్ట సాముహిక కుంకుమ పూజలో పాల్గొనదలచే దంపతులు రూ.400 టికెట్ రుసుం చెల్లించాలన్నారు. పూజ అనంతరం భక్తులకు శేషవస్త్రాలు, పావుకేజీ పులిహోర, పావుకేజీ చక్కెర పొంగలి, శ్రీచక్రయంత్రం(రాగి)ని మహాప్రసాదంగా అందజేస్తామని తెలియజేశారు. స్థానికేతరులు ఎవరైనా పూజలో పాల్గొనలేనిచో వారి గోత్రనామాలతో పూజ చేసి లక్ష్మీ యంత్రం, కుంకుమ, ప్రసాదం పోస్టల్ ద్వారా ఇంటి చిరునామాకు పంపనున్నట్టు పేర్కొన్నారు. పూజా రుసుము చెల్లింపు, ఇతర వివరాలకు 0891–2568645, 2566515, 2731250 నంబర్లలో సంప్రదించవచ్చని తెలియజేశారు.

అవయవదానంపై అపోహ వద్దు

కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్

సీతమ్మధార: అపోహలు వీడి అవయవదానానికి అందరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. దాతలు సరైన సమయంలో స్పందించకపోవటం వలన ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లలో రాష్ట్రంలో 90 వేల మందికి అవయవాలు అవసరం కాగా 923 మందికి మాత్రమే అందించగలిగామని గుర్తు చేశారు. సావిత్రిభాయ్ పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్‌కు అనుసంధానమైన ఆల్ ఇండియా బాడీ అండ్ డోనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్న అవయవదాన ఉత్సవాల్లో భాగంగా ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. జీవన్‌దాన్ సంస్థ ద్వారా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిర్వహిస్తూ ప్రయారిటీ బేసిస్ మీద అవయవదాన క్రతువును నిర్వహిస్తున్నట్టు వివరించారు. అవయవదాన ఆవశ్యకతను తెలుపుతూ అందరితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డా.కె.శివానంద, అఖిల భారత అవయవదాతల సంఘం చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి, అనాటమీ డిపార్టుమెంట్ ప్రొఫెసర్లు, వైద్యాధికారులు, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ వేళల్లో స్వల్ప మార్పు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నంలో ప్రతీరోజు బయల్దేరే విశాఖపట్నం–బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్ వేళలు పలాసలో స్వల్పంగా మారినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ రైలు ఆగస్టు 15వ తేదీ నుంచి పలాస స్టేషన్‌కు రాత్రి 6.43 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 6.48 గంటలకు బయల్దేరుతుంది.